# వేడి నిట్టూర్పులు

★

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

★

ఏమండీ 'అమ్మ' కెళదామండీ.

"పోనీ ఒక రేడియో అయినా కొనరు. నిన్న మనవాళ్ల సెట్టులో ఎవరో మోహినట చాలాబాగా పాడిందండి......ఏమండీ"

"అబ్బ ! వెధవ మోహినీ గీమినీన్ని ఎందుకివన్నీ నన్ను దిద్దుకోనివ్వవా ?

"అమ్మో, ఎంతకోపం. అయితే ఏమిటండీ, ఇంత కష్టం ఏమిటండీ ఈ పరీక్ష. మన ప్రక్కవాళ్ల బ్బాయిది రెండేళ్లయిపోతోంది. అన్నిటికీ అదృష్టం ప్రధానం" అని తెరిపిలేకుండా మాటలు ఘోరంగా కురిపిస్తోంది దేవకమ్మ.

"నన్ను దిద్దుకోనివ్వవా ? జావ్ పోయి పండుకో, ఇక్కడ నన్ను చికాకుపెట్టకు." అని జోరుగా సుబ్బారావు మేష్టరుగారు పేపర్లతో కుస్తీపడుతున్నారు. మెట్రిక్యులేషన్ పేపర్లు వచ్చాయి. దిద్ది అర్జంటుగా పంపేయాలి గాబోలు. మరీ తొందరగా ఉన్నాడు. పేపర్లనే యుద్ధభూమిమీద, అక్షరాల్నే వీరులతో, రెడ్ కలర్ పెన్సిలనే ఆయుధంతో, మార్కులనే రక్తపాతాన్ని కావిస్తున్నాడు. క్షణ క్షణానికి వీరావేశం ఎక్కువవుతోంది.

దేవకమ్మ, "నిన్నటి సినీమా 'రైతుబిడ్డ' ఎంత బాగుందండీ"... ఏమిటా... పాట... పేరు మరచిపోయాను...... "రాబోకురా బోకురా...బోకురా చంద్రుడా..."ఏమిటో తిన్నగా జ్ఞాపంకలేదు" అని కూనిరాగం తీసింది.

"అఘోరించినట్టే ఉంది నీపాట,...... ఏమిటీ అల్లరీ, ఆ యింకా నాకుగాని కోపం వచ్చిందంటే ఒళ్ళు హూనంచేసేసి ఊరుకుంటాను." అన్నాడు అగ్గిబరాటాలాగు సుబ్బారావు.

దేవకమ్మ "అంతకోపం అయితే బతకడం కష్టం, ఆ పేపరు చదవండీ నేనూ వింటాను—" అంది.

సుబ్బారావు, రైల్వేస్టేషనుగూర్చి వ్యాసం ఇలా చదువ మొదలెట్టాడు.

"ఉపోద్ఘాతం ; అయ్యా నే నిదే తొలిసారి పరీక్షకి వచ్చుటచే నా కనుభవము తక్కువ. కావున తప్పులను ఒప్పులుగానే భావింతురు. గాక— గ్రంథవిస్తర భీతిచే పెద్దవ్యాసం వ్రాయలేదు." అని ఉపన్యాస ధోరణిలో ఉన్న వ్యాసాన్ని చదివి సుబ్బారావు "ఏమిటే, ఊకదంపూ, అని అంతా కొట్టిపారేశాడు. ఇంతసేపు పరధ్యాన్నంగా ఉన్న దేవకమ్మ ఒక్కసారి చూసింది "ఏమండీ చదవడం మానేసేరు" అంది. "నేచదవ దలచుకోలేదు" అన్నాడు "పోనీండి పాపం, కట్టు నాగమ్మ, దిద్దండీ," అన్నాది. ఆపేపరు దిద్దిస్తేనే పోయి పడుకుంటా నన్నాది. ఈ డబ్బా ఎల్లాగన్నా వదలుకొట్టుకోవాలని దిద్దిపారేశాడు. దేవకమ్మ బలవంతంమీద అక్కడక్కడ మార్కులు పడ్డాయి. దేవకమ్మలేచి "అంతకోపం ఎవరు భరించగలరు నేపోయి పడుకుంటానమ్మా" అంది. "ఉద్ధరించావు" అని, నిట్టూర్పు విడిచేడు సుబ్బారావు.

అతడు తన సంసారంలో ప్రతివిషయం గోను ఇలాంటి వేడి నిట్టూర్పులు విడుస్తాడు పాపం. హృదయానికి హాయిలేదు !